క్లుప్తంగా

రైతుల ఆకలి తీర్చడం అదృష్టం



భోజనం వడ్డిస్తున్న చెవిరెడ్డి లక్ష్మి

పాకాల : వారపు సంతల్లో రైతులు, వ్యాపారుల ఆకలి తీర్చడం మా అదృష్టంగా భావిస్తున్నామని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె శనివారం దామలచెరువు వారపు సంతలో రైతులకు భోజనాలను వడ్డించారు. ఆమె మాట్లాడుతూ సంతలో వ్యాపార నిమిత్తం వచ్చే రైతుల ఆకలితో ఉండవద్దన్నారు. అందరూ భోజనం చేయాలని సూచించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శనివారం తెలంగాణ రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, తెలంగాణ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డూ ప్రసాదాలతో సత్కరించారు.

నేడు క్యాండిల్ లైట్ ర్యాలీ

తిరుపతి అర్బన్: జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ఎయిడ్స్, హెచ్ఐవీపై క్యాండిల్ లైట్ ర్యాలీ నిర్వహించనున్నట్టు జిల్లా ఎయిడ్స్ కంట్రోల్ అధికారిణి అరుణ సులోచనదేవి తెలిపారు. ర్యాలీ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం నుంచి ప్రారంభమవుతుందని, రామకృష్ణ డీలక్స్ సర్కిల్ వద్ద మానవహారం ఏర్పాటుచేస్తామన్నారు. ప్రతి ఏటా ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవంగా డిసెంబర్ ఒకటిన, అంతర్జాతీయ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేగా మే నెల మూడో ఆదివారం నిర్వహిస్తున్నట్టు వివరించారు.

28న కరుబ, కురుమ సంఘం కమిటీల ఎంపిక

తిరుపతి కల్చరల్: యూత్ హాస్టల్లో ఈ నెల 28వ తేదీన ఆంధ్రప్రదేశ్ కురుబ, కురుమ సంఘం తిరుపతి జిల్లా, తిరుపతి నగర నూతన కమిటీలు, యువజన విభాగం కార్యవర్గాలను ఎంపిక చేయనున్నట్టు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. కురుబ, కురుమ సంఘం నేతలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రాఫిట్ షూ కంపెనీ షోరూం ప్రారంభం



ప్రాఫిట్ షూ కంపెనీ షోరూం

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం గాంధీ రోడ్డులో ఏర్పాటు చేసిన ప్రాఫిట్ షూ కంపెనీ షోరూంను శనివారం ఘనంగా ప్రారంభించారు. ఆ కంపెనీ జోనల్ మేనేజర్ ఎల్.దుర్గారావు మాట్లాడుతూ తమ కంపెనీ ద్వారా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో 102 బ్రాంచిలు పనిచేస్తున్నట్టు తెలిపారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన 103 బ్రాంచి షోరూంలో అన్ని రకాల బ్రాండెడ్ షూలు, చెప్పులు, లెదర్ బెల్టులు, లెదర్ పర్సులు, లేడీస్ హ్యాండ్ బ్యాగ్స్, పిల్లల స్కూల్ బ్యాగ్స్ లభిస్తాయని తెలిపారు. షోరూం ప్రారంభం సందర్భంగా శని, ఆదివారాల్లో కొనుగోలుపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నట్టు తెలిపారు. ప్రాఫిట్ షూ కంపెనీ ఏరియా మేనేజర్ ఇర్ఫాన్, బ్రాంచ్ మేనేజర్ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

ప్రశాంతంగా ప్రవేశ పరీక్షలు

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీ గురుకుల పాఠశాల, ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు తిరుపతి జిల్లాలో శనివారం నిర్వహించిన ప్రవేశ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు పరీక్షల జిల్లా కో-ఆర్డినేటర్ సరస్వతి తెలిపారు. ఉదయం ఏపీ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు నిర్వహించిన కామన్ అడ్మిషన్ టెస్టుకు 1,488 మందికి గాను 343 మంది గైర్హాజరైనట్టు వెల్లడించారు. మధ్యాహ్నం జరిగిన ఏపీఆర్‌జేసీ ప్రవేశ పరీక్షకు 2,213 మందికి గాను 431 మంది గైర్హాజరైనట్టు తెలిపారు. అలాగే ఏపీఆర్‌డీసీలో ప్రవేశాలకు 43 మందికి 10 మంది గైర్హాజరైనట్టు ఆమె పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ వైద్య పరీక్షలు చేయించుకోండి

- ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మా బాధ్యత
- చంద్రగిరి ఎమ్మెల్యే సతీమణి చెవిరెడ్డి లక్ష్మి



వైద్య శిబిరాన్ని సందర్శించిన చెవిరెడ్డి లక్ష్మి

పాకాల : మండలంలోని ప్రజలకు వైద్య పరీక్షలు చేయించడం మా బాధ్యతని చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి పేర్కొన్నారు. ఆమె శనివారం కావలివారిపల్లి, అచ్చమ్మ అగ్రహారంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాలను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ నిరభ్యంతరంగా వైద్య పరీక్షలు చేసుకునేలా అవగాహన కల్పించాలని స్థానిక నాయకులకు సూచించారు. ఈ శిబిరంలో 43 రకాల ఉచిత వైద్య పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. ముందుగా వ్యాధులను గుర్తించి మందులు వాడితో నయం చేసుకోవచ్చన్నారు. రోగులకు 104 ద్వారా మందులను నేరుగా ఇంటి వద్దే అందజేస్తున్నట్టు చెప్పారు.

ఎమ్మెల్యేకు రుణపడి ఉంటాం



ఇన్ని రకాల వైద్య పరీక్షలను ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా పూర్తిగా ఉచితంగా చేయడం చాలా సంతోషంగా ఉంది. గతంలో ఇలా ఎప్పుడూ ఏ నాయకుడూ వైద్య పరీక్షలు చేయించలేదు. ప్రజల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకుని వైద్య పరీక్షలు చేయిస్తున్న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి రుణపడి ఉంటాం. – కె.గిరిజ, కావలివారిపల్లి, పాకాల మండలం

ప్రజలకు ఎంతో ఉపయోగకరం



చాలామంది పేదరికంతో వైద్య పరీక్షలు చేయించుకోలేక ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో ప్రజల ఆరోగ్యం బాధ్యత తీసుకున్న ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు. చాలా మంది అనేక రకాలుగా బురద జల్లుతున్నారు. విమర్శించడం మాని ప్రజలకు మంచి చేయడం నేర్చుకోవాలి. వైద్య పరీక్షల శిబిరం ప్రజలకు ఎంతో ఉపయోగకరం. – కె.మునిరాజారెడ్డి, కావలివారిపల్లి, పాకాల మండలం

సద్వినియోగం చేసుకోవాలి



ఈ శిబిరంలో 43 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. షుగర్, బీపీ, గుండె సంబంధిత, థైరాయిడ్, కొలెస్ట్రాల్, కిడ్నీ, లివర్ వంటి పరీక్షలు చేస్తున్నారు. ముందస్తుగా రోగ నిర్ధారణ జరిగితే సరైన మందులు వాడొచ్చు. తద్వారా వ్యాధిని నయం చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. – డాక్టర్ శ్రీకాంత్

‘యువనేస్తం’ సేవలు అభినందనీయం



కరదీపికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: గిరిజన కాలనీల్లో పేదలు, విద్యార్థుల విద్యాభివృద్ధికి, ప్రమాదంలో గాయపడిన పేదలకు యువనేస్తం అసోసియేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం కొనియాడారు. యువనేస్తం అసోసియేషన్ మూడవ వార్షికోత్సవం సందర్భంగా రూపొందించిన వివిధ సేవా కార్యక్రమాల కరదీపకను ఆయన ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేదల అభ్యున్నతికి అసోసియేషన్ అధ్యక్షుడు మునిశేఖర్ తమ బృందం చేస్తున్న సేవలపై హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో యువ నేస్తం అసోసియేషన్ అధ్యక్షుడు మధురాంతకం మునిశేఖర్, కార్యదర్శి జశ్వంత్, కోశాధికారి మునెమ్మ, ప్రభాకర, శ్రీకాళహస్తి మండలం కోర్డినేటర్ నాగమణి పాల్గొన్నారు.

ముస్లిం పిల్లలకు ఒడుగులు

పాకాల : మండల కేంద్రంలోని మసీదు అక్సాలో శనివారం ముస్లిం పిల్లలకు ఒడుగులు(ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మత గురువులు, ముతవల్లీలు 35 మంది పిల్లలకు ఒడుగులు చేయించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మునీర్, ప్రభుత్వ ఖాజీ మహ్మద్‌రఫీ, కలీముల్లా, జియావుద్దీన్, బాజీ, నాగూర్‌బాషా, షరీఫ్, ముద్దసీర్, చాంద్‌బాషా, నజాముద్దీన్, రహంతుల్లా తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాయికృష్ణ గేయధార



సాయికృష్ణ యాచేంద్రను సత్కరిస్తున్న నిర్వాహకులు, అతిథులు

తిరుపతి కల్చరల్: తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలోఓ ప్రైవేటు హోటల్లో శనివారం చెన్నైకి చెందిన ఐకేఏఎస్ టెక్నాలజీస్ సహకారంతో టీటీడీ ఎస్వీబీసీ చానల్ చైర్మన్ వి.సాయికృష్ణ యాచేంద్ర నిర్వహించిన సంగీత గేయధార కార్యక్రమం సభికులను అలరింపజేసింది. ఈ కార్యక్రమానికి శతావధాని మేడసాని మోహన్ అధ్యక్షత వహించారు. భారతీయ విద్యాభవన్ సంచాలకుడు ఎస్.సత్యనారాయణరాజు, శతావధాని ఆముదాల మురళి, విశ్రాంత ఆచార్యుడు ఎల్‌బీ.శంకరరావు, నెమిలేటి కిట్టన్న, శోభారాజ్, ఈజీ హేమంత్‌కుమార్, బాబు బృందం పాల్గొన్నారు. వారి ప్రశ్నలకు యాచేంద్ర రాగతాళ సమన్వయంగా గేయాలు ఆలపించారు. రచయిత కృష్ణస్వామి రాజు, గుణశేఖర్ నాయుడు, గంగవరపు శ్రీదేవి, వేమూరి జయరాంప్రసాద్, యువశ్రీ మురళి, భాస్కరరాజు పాల్గొన్నారు.

నేడు మహతిలో వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం

తిరుపతి కల్చరల్: మహతిలో ఆదివారం వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర విశ్వబ్రాహ్మన వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎం.భారతి, మార్గాచార్యులు ఉమాపతి ఆచారి తెలిపారు. వారు శనివారం ప్రెస్‌క్లబ్‌లో కల్యాణోత్సవం ఆహ్వాన పత్రికలు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ టీటీడీ సహకారంతో ప్రతి ఏటా స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సాయంత్రం 4 గంటలకు విశ్వబ్రాహ్మణ ధర్మాల గురించి పలువురు పీఠాధిపతుల ఉపన్యాసం, ప్రసాద వితరణ, వేద పండితుల ఆశీర్వాదం ఉంటుందన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

తిరుపతి క్రైమ్: ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ నరసప్ప పేర్కొన్నారు. ఆయన శనివారం డీఎస్పీ రవికుమార్, ట్రాఫిక్ సీఐలు భాస్కర్ రెడ్డి, శ్రీనివాసులుతో కలిసి ట్రాఫిక్ నియంత్రణ, క్రమబద్ధీకరణపై రామచంద్ర పుష్కరిణి వద్ద ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు తప్పకుండా యూనిఫామ్ ధరించాలన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోకూడదన్నారు. తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, ఇన్స్యూరెన్స్ ఫిట్నెస్ సర్టిఫికెట్ కలిగి ఉండాలన్నారు. ప్రయాణికులను ఎక్కించుకునేటప్పుడు, దింపేటప్పుడు రోడ్డుకు పూర్తిగా పక్కకు వెళ్లి ఆపాలన్నారు. జూన్ 15వ తేదీ లోపు ప్రతి ఒక్కరికీ అన్ని రికార్డులు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఫ్రీ లెఫ్ట్‌లో ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలను ఆపరాదని తెలిపారు.

ప్రజా చైతన్యంతోనే రాయలసీమ అభివృద్ధి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: ప్రజలను చైతన్యం చేస్తూ రాయలసీమ అభివృద్ధికి రాయలసీమ సాగునీటి సాధన సమితి కృషి చేస్తోందని ఆ సమితి అధ్యక్షుడు బి.దశరథరామిరెడ్డి తెలిపారు. ఆయన శనివారం ప్రెస్‌క్లబ్‌లో జల జాగరణ పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ దశాబ్దాల కాలంగా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి కోసం ఏ రాజకీయ పార్టీ కృషి చేయలేదని ఆరోపించారు. నాయకులు పదవుల కోసమే ప్రయత్నించారని విమర్శించారు. రాయలసీమ సస్యశ్యామలం కోసం ఏడేళ్లకు మునుపు సిద్ధేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన చేశారమన్నారు. శంకుస్థాపన 7వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 31వ తేదీ సాయంత్రం 6 నుంచి జూన్ 1వ తేదీ ఉదయం 10 గంటల వరకు చేపడుతున్న సిద్ధేశ్వరం జల జాగరణ దీక్షను విజయవంతం చేయాలని కోరారు. నేతలు శివశంకరరాజు, మాంగాటి గోపాల్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాసరెడ్డి, విజయ్, సుధాకర్‌రావు, కేఎస్.రాజు, జయరామిరెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్‌లో విశ్వం విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న విశ్వనాథరెడ్డి, విశ్వచందన్‌రెడ్డి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిసెట్–2023 ఫలితాల్లో తిరుపతి వరదరాజనగర్‌లోని విశ్వం విద్యాసంస్థ విద్యార్థులు అత్యుత్తమ మార్కులు, ర్యాంకులతో విజయకేతనం ఎగురవేసినట్లు ఆ విద్యాసంస్థ అధినేత ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఏ.చరితశ్రీ రాష్ట్ర స్థాయిలో 119 మార్కులతో 25వ ర్యాంకు, జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకును కైవసం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎం.సంజనరెడ్డి అన్నమయ్య జిల్లా స్థాయిలో ద్వితీయ, పి.మొహమ్మద్ తాలిబ్ తృతీయ ర్యాంకులు సాధించినట్లు పేర్కొన్నారు. ఎం.భువనేశ్వర్‌రెడ్డి, ఎస్.వెంకటముఖేష్, కె.లక్ష్మణ్ వర్మ, సి.శ్రావణి, ఈ.దివ్య, జి.లహరి, బి.భువనేశ్వరి, బి.సిద్ధార్థ, తనూజా, భానుప్రకాష్, మహీధర్, దీక్షిత, నరసింహ తదితరులు జిల్లా స్థాయిలో ఉత్తమ మార్కులు సాధించినట్లు తెలిపారు.

హోమ్‌గార్డు ఆత్మహత్య

పెనుమూరు(చిత్తూరు అగ్రికల్చర్) : ఆత్మహత్య చేసుకుని హోమ్‌గార్డు మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా.. గాగమ్మగారిపల్లికి చెందిన పద్మేష్‌బాబునాయుడు(42) తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌లో హోమ్‌గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను గత నాలుగు నెలలుగా విధులకు హాజరు కాలేదు. దీనికితోడు మద్యానికి బానిస అయ్యాడు. పైగా కుటుంబ కలహాలు తోడవడంతో మనస్థాపానికి గురై ఇంట్లోని ఫ్యాన్‌కు ఉరి వేసుకుని మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ అనిల్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అభివృద్ధి పనుల్లో జాప్యం తగదు



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో జాప్యాన్ని ఉపేక్షించేది లేదని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్, స్మార్ట్ సిటీ ఎండీ డి.హరిత హెచ్చరించారు. ఆమె శనివారం స్మార్ట్ సిటీ అభివృద్ధి ప్రాజెక్టుపై అధికారులతో సమీక్షించారు. పనులు నత్తనడకన సాగుతుండడంపై మండిపడ్డారు. ఆమె మాట్లాడుతూ యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించాలన్నారు. కాలయాపన చేస్తున్న కాంట్రాక్టర్లపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వినాయక సాగర్, డిస్ట్రిక్ట్ ఆర్ట్ స్టూడియో, ఇండోర్ స్టేడియం, క్రికెట్ స్టేడియం, వినాయక సాగర్ నంది కూడలిలోని షాపింగ్ కాంప్లెక్స్ పనులను ఏడాది క్రితమే పూర్తి చేయాల్సి ఉందని, ఆలస్యం చేయడం వల్ల కార్పొరేషన్‌పై ఆర్థిక భారం పడిందన్నారు. జూలై నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. లేని పక్షంలో తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇంజినీర్లు ప్రతిరోజూ పనులను పర్యవేక్షించాలని, నాణ్యతను తనిఖీ చేయాలని ఆదేశించారు. ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, డీఈలు విజయకుమార్ రెడ్డి, రవీంద్రరెడ్డి, దేవిక, మేనేజర్ చిట్టిబాబు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

మహా సంప్రోక్షణకు శాస్త్రోక్తంగా అంకురార్పణ



మహాసంప్రోక్షణంలో అంకురార్పణ చేస్తున్న అర్చక పండితులు



విష్వక్సేనులను ఊరేగిస్తున్న అర్చకులు, ఆలయ అధికారులు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో ఆదివారం నుంచి 25వ తేదీ వరకు చేపట్టనున్న మహా సంప్రోక్షణ నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శనివారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ చేపట్టారు. ఉదయం 7.30 నుంచి 9 గంటల వరకు ఆచార్య రుత్విక్ వరణం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీవిష్వక్సేనులను ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించారు. అనంతరం మృత్సంగ్రహణం, వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ చేపట్టారు. గోవిందరాజ స్వామి ఆలయ విమాన గోపురం బంగారు తాపడం పనులు పూర్తి కావడంతో జీర్ణోద్ధరణ, మహాసంప్రోక్షణ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శాంతి, ఏఈవో రవికుమార్, ప్రధాన అర్చకుడు శ్రీనివాస దీక్షితులు, సూపరింటెండెంట్ నారాయణ, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాధాకృష్ణ పాల్గొన్నారు.

పాలిసెట్‌లో గగన విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో విద్యాసంస్థ డైరెక్టర్ కరుణామూర్తి

తిరుపతి ఎడ్యుకేషన్ : పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించిన పాలిసెట్‌లో తిరుపతిలోని శ్రీగగన విద్యాసంస్థ విద్యార్థులు ప్రతిభ కనబరచినట్లు ఆ సంస్థ డైరెక్టర్ కరుణామూర్తి తెలిపారు. ఈ పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ ఉత్తమ మార్కులతో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను ఆయన అభినందించారు.

తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే చర్యలు

తిరుపతి అర్బన్: వ్యాపారులు తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ మల్లేశ్వర్ తెలిపారు. విశ్వం స్కూల్‌లో శనివారం తూనికలు, కొలతల దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. మోసాలపై టోల్‌ఫ్రీ నంబర్ 18004254202కు చేయాలని సూచించారు. జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షుడు పి.రాజారెడ్డి, విశ్వం స్కూల్ కరస్పాండెంట్ విశ్వచందన్ పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి రూ.10 వేలు సాయం

తిరుపతి కల్చరల్: అనారోగ్యంతో బాధపడుతున్న పెరుమాళ్‌పల్లి సర్కిల్‌లోని మెకానిక్ ప్రభాకర్‌రెడ్డికి శనివారం తిరుపతి టూవీలర్స్ మెకానిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆవుల మునిరెడ్డి ఆధ్వర్యంలో రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అంతకుముందు గాంధీ భవన్ ఆవరణలో తిరుపతి టూవీలర్స్ మెకానిక్ అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు లక్ష్మణరాజు, కార్యదర్శి మల్లేశ్వర్, కోశాధికారి బాబు, జలంధర్, ఉపేంద్ర, నరేంద్ర, తరుణ్ పాల్గొన్నారు.

రేపు అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం

తిరుపతి మంగళం: అంతర్జాతీయ జీవ వైవిధ్య దినోత్సవం –2023 సందర్భంగా సోమవారం ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఆడిటోరియంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం నిర్వహించనున్నట్లు రాష్ట్ర జీవ వైవిధ్య మండలి సెక్రటరీ కె.గోపీనాథ్ తెలిపారు. ఇందులో ముఖ్య అతిథులుగా మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, కె.నారాయణస్వామి, ఆర్.కే.రోజా, స్పెషల్ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్, రాష్ట్ర అటవీ దళాధిపతి మధుసూదన రెడ్డి, జీవ వైద్య మండలి చైర్మన్ బి.ఎం.కె రెడ్డి, ఎమ్మెల్యేలు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఘనంగా చౌడేశ్వరిదేవి జ్యోతి మహోత్సవం

తిరుపతి కల్చరల్: సత్యనారాయణపురంలో శనివారం చౌడేశ్వరి దేవి జ్యోతి మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. తొగటవీర క్షత్రియ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.బాబు ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు, హోమం చేపట్టారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి అమ్మవారికి రతి పూజ, జ్యోతి ప్రజ్వలన, సింహ వాహన సేవ వేడుకగా నిర్వహించారు. శివప్రసాద్ పాల్గొన్నారు.